# అసలుకీలకం

రచన :
శ్రీమతి పరానేని శ్రీ శైల భ్రమరాంబ

త్తలవని తలంపుగా వెంకటలక్ష్మి కూతుర్ని తోడుకుని తీసుకు వచ్చింది. చూడేళ్ళయి ఆ ఊరు ట్రాన్స్‌ఫరై మేము వచ్చామన్న మాటేగాని ఒక్కసారైనా పక్క బారెట్లో వున్న ఆమెనీ పిల్లల్నీ చూచిరాలేకపోయా - అల్లాంటిది ఇద్దరి పిల్లల్నీ తీసుకువచ్చిన వెంకటలక్ష్మిని చూచేసరికి నాలో నేనే సిగ్గుపడ్డ మాట నిజమే.

ఆమె నేనూ ఇంకా మాట్లాడుకొంటూండగానే పిల్లలిద్దరూ గాఢంగా నిద్రపోయారు. ఆ పిల్లల్ని కన్ను చూస్తూండమని చెప్పి ఇప్పుడే వస్తానని తన మిత్రురాలిని చూచి వస్తానని వెళ్ళింది వెంకటలక్ష్మి.

'ఎవరింటికి?' అని నేను అడగలేదుకాని తను వచ్చేవరకూ పిల్లలను బాధ్యతగా చూడమని మాత్రం మరోమారు హెచ్చరించి మరీ వెళ్ళింది.

వెంకటలక్ష్మి వీధిమలుపుపైనా తిరిగిందో లేదో ఆమె కూతురు లీల నిద్రనుంచి లేచింది, లేస్తూండగానే అమ్మా! అంటూ ఆరున్నొక్క రాగం ఆలాపిస్తూ లేచింది. 'మళ్ళీ పడుకొంటుందన్న ఆశతో 'బచ్చోమ్మా' అంటూ సముదాయిస్తూ మెల్లిగా జోకొట్టా-నన్ను చూచేసరికి పెద్దగా అరుస్తూ లేచికూర్చుని రాగం శ్రుతి పెంచింది-లీల ఏడ్పుకి రెండో మంచం మీద వున్న పిల్లాడు శంకర్ కూడా లేస్తాడేమోనన్న భయంతో మెల్లిగా లీలని ఊరుకోనేటట్లు కన్పించకపోయేసరికి మెల్లిగా చంకని ఎత్తుకొని సావిట్లోకి తీసుకు వస్తోంటే, ఒక్క అదటన నా చంకనుంచి క్రిందకిజారి, కిందపడి దొర్లడం, అరవడం, ఏడవడం, నానా అఘాయిత్యం ప్రారంభించింది లీల-దగ్గరగా తీసుకు బిస్కట్లు పెట్టబోయా - కాని ఆ బిస్కట్లు లీల చేతుల్లో ఖండ ఖండాలై నేలమీద చిమ్ముకొన్నాయ్-లడ్డు వుండలు చేతికిచ్చా - అవి గోడకి వెళ్ళి కొట్టుకొన్నాయ్-ఎన్ని విధాల తియ్యని మాటల్తో ఓదార్చినా లీల ఊరుకొనే స్థితిలో లేదు. కొన్ని క్షణాలు ఎన్నో చేతికిచ్చి తినమని ఎంతో బ్రతిమాలా - కాని లీల లీలలు ఎక్కువై హైతకంచేస్తూ, పెద్దగా ఏడుస్తూ, జడ పీక్కుని, జడలో పువ్వు లాక్కుని, ముఖమంతా రక్కుని, కంఠం చించుకుని మరీ ఏడుస్తోంది-అయినా ఓపిక పట్టి లీలని బుజ్జగించడం ప్రారంభిచా ఇంక గత్యంతరంలేక-

ఈ ఘోషకి ఆకుర్రాడు శంకర్ కూడా లేచాడు. లీల కంటే ఏడాకులెక్కువే చదివానన్నట్లు లేవడమే శోకంతో లేచాడు ఆ బడుద్ధాయి-ఫ్లాస్కులో పాలుగాజుగ్లాసులో పోసి పిలవానికి పట్టడంకోసం తీసుకువచ్చి ఓచోటు పెట్టి పంచదారకోసం లోపలికి వచ్చా - ఈ లోగా ఏడుస్తూన్న లీల గబగబా వచ్చి గాజు గ్లాసు చేతుల్తో ఎత్తి త్రాగబోతూ గభీలున క్రిందికి ఒదిలేసింది.

పాలు ఒలికిపోవడం, గ్లాసు పగిలిపోవడం మామూల్లాగున్నా పిల్లవాని ఏడ్పు గుక్క

త్రిప్పకోకుండా ఏడుస్తూంటే వానిని చంకలో బెట్టుకు వీధిలోకి వచ్చి ఎవరో దావే పోయే దానయ్యని బ్రతిమాలి హోటల్ నుంచి పాలు తెప్పించా-ఈలోగా... చంకలో శంకర్ ఏవిధంగా ఎత్తుకొని ఊరుకోబెట్టినా కాని వినక హోరెత్తి గోలెత్తిపోతున్నాడు - శంకర్‌ని సముదాయించడం ఒక ఎత్తు; లీల చిందులు తొక్కుతూ గాజు పెంకులమీద అడుగు వేస్తుందేమోననే భయమూ; బాధ్యతా పీడిస్తూంటే— ఇదెక్కడి గోల! కర్మచాలక ఎవరైనా చూస్తే పిల్లల్ని ఎత్తుకోవడం చేతకాక, ఈ పిల్లలిద్దర్నీ కొంపతీసి కొడ్తున్నానేమోనని గాభరాతో గుండెలు గుభుక్కుమన్నాయి.

అంతలో మహాబుద్ధిమంతురాలి మల్లే లీల డ్రాయరుదగ్గరకి వెళ్ళింది. గాజు పెంకులకి దూరంగా డ్రాయరు దగ్గరే కేలండరులోని బొమ్మను చూస్తూ నిల్చుంది కదా! మళ్ళీ పిలిస్తే గాలివానలా ఏడ్పు కిలంకించుకొంటుం దనుకొని శంకర్‌ని భుజంమీద వేసుకు జో కొడ్తూ త్రిప్పడం ప్రారంభించా.

ధన్‌మని చప్పుడైంది, ఏమిటో అని తిరిగి చూస్తే! ఫ్లాస్కు చేత్తో ఎత్తేసింది-ఫ్లాస్కు పోయిందన్న కోపంతో గ్రుడ్లురిమాను-మళ్ళీ రణగొణ ధ్వని ఏడుపు మొదలు - ఇహ ఏమన్నా ముక్కలైన ఫ్లాస్కు తిరిగిరాదని. ఈ చెలరేగిన గాలివానని తగ్గించేందుకై (మనస్సులో ఉడికిపోతోన్నా) ఊరుకో అమ్మా లీలా! పోతే పోయిందిలే! నా తల్లివి కదూ? బంగారు కొండవి. అని దాన్ని బ్రతిమాల్తూ 'ఏంకావాలమ్మా?' అనడిగా.

కోపంగా మూతి బిగించి రాగాలెడ్తుందే కాని ఎంతకీ చెప్పదు ఆ లీల - రకరకాలుగా ఓపికను ప్రదర్శిస్తూ అడిగాక గోడకేసి చూపిస్తూ 'ఆ బొమ్మకావాలి!' అంది.

ఆ కేలండరు మా శ్రీవారు బెంగుళూరు క్యాంపుకి వెళ్ళి ఎంతో ముచ్చటగా తెచ్చుకొన్న అత్యంత ప్రియమైనది - అది ఎల్లా ఇవ్వడం?

'అదికాదమ్మా! ఆ బొమ్మ ముట్టుకో కూడదు. నా బంగారు తల్లివి కదూ?' అంటూ బ్రతిమాలి, బుజ్జగించి, ఎన్నెన్నో చెప్పా - అయినా ఆ లీల ఆరునొక్కటి ఆలాపన మానకుండా క్షణానికో డిగ్రీ చొప్పున హెచ్చిస్తోంటే; నా చంకలో శంకర్ అక్కని మించి అరుస్తూ ఇంటిమీది పెంకులు, దూలాలు, వాసాలుతో సహా ఎగిరగొట్టేస్తున్నాడు - ఈ రభసకి ఇరుగు పొరుగులే కాకుండా ఎదురింట్లో వాళ్ళుకూడా కిటికీల్లోంచి తొంగిచూస్తూ ముసిముసి నవ్వులు నవ్వుతున్నారు.

ఇప్పుడీ రణరంగం చల్లారితే...తర్వాత శ్రీవారికి ఏదో సమాధానం చెప్పకోవచ్చునని ఆ కేలండరుతీసి లీలకిచ్చి సావిట్లో కూర్చోమని శంకర్‌కి పాలుపట్టడం ప్రారంభించా.

కడుపునిండా పాలు త్రాగిన శంకర్ తరవాయి అవశిష్టాలు తీర్చడం ప్రారంభించాడు--నేను శంకర్ పనంతా పూర్తిచేసి వానిని మంచంమీద పడుకోబెట్టేవరకూ కిక్కురుమనకుండా లోపల బుద్ధిగా కూర్చున్న లీలని చూడాలని ముచ్చటేసి అక్కడికి వెళ్ళి చూద్దును

(తరువాయి 20 వ పేజీలో)